PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
# సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు
శుక్రవారం 09-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :129 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

# సుపరిపాలనకు

## మొబైల్ ఫోన్ ఓ మంచి టూల్: మోదీ

- మొబైల్ సాంకేతికత సుపరిపాలనకు వారధి.
- 5జీతో ప్రతి జిల్లాకు వేగవంతమైన ఇంటర్నెట్.
- DBTతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సాయం.
- సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లపై కొత్త టెక్నాలజీ అవసరం.



ఒకప్పుడు మాట్లాడుకోవడానికి, సందేశాలు పంపించేందుకు మాత్రమే ఉపయోగపడిన మొబైల్ ఫోన్.. నేడు సుపరిపాలన కు వారధిగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రభుత్వ సేవలను ఇది ప్రజల అరచేతిలోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. గురువారం జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2026లో ప్రసంగించిన మోదీ.. డిజిటల్ ఇండియా ప్రయాణాన్ని వివరించారు.

“5జీ సేవల విస్తరణతో దేశంలో ఇంటర్నెట్ వేగం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. మొబైల్ సాంకేతికతతో ప్రయాణ సమయం, నిరీక్షణ, ఖర్చులు తగ్గాయి. గేమింగ్, కంటెంట్ క్రియేషన్ వంటి కొత్త రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. డిజిటల్ సేవల ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు వేగంగా చేరుతున్నాయి. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (ఐడీు)తో నేరుగా లబ్ధిదారుల ఖాతాకే ప్రభుత్వ సంక్షేమ పథకాల సాయం చేరుతోంది. దీంతో రూ.5 లక్షల కోట్ల మేర సొమ్మును తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా అరికట్టగలిగాం” అని ప్రధాని మోదీ వివరించారు.

### సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా ఒకే ధర్మాసనంపై..

సాంకేతికత కొద్దిమందికే పరిమితం చేయకుండా, ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

2లో▸



## మూడోరోజు మొదలైన నిరసనలు..

### రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

- CEC జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఇండియా కూటమి నేతల నిరసన.
- విపక్ష ఎంపీలు రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించారు.
- రాహుల్‌గాంధీ మోదీ, అమిత్‌షా తదితరులపై తీవ్ర ఆరోపణలు చేశారు.
- విపక్ష ఎంపీలు రాష్ట్రపతి ముర్మును కలిసి వినతిపత్రం ఇవ్వనున్నారు.

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ.. దేశ రాజధాని దిల్లీలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు నిరసనకు దిగారు. ఆందోళనల్లో భాగంగా తొలుత విపక్ష ఎంపీలంతా కలిసి రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు.

“300 మంది ఎంపీలందరం కలిసి ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం. నిన్న జంతర్‌మంతర్ వద్దకు వెళ్లాలని ప్రయత్నించాం. కానీ మమ్మల్ని అనుమతించలేదు. మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం వద్దకు వెళ్లకుండా ఆపారు. ఆ తర్వాత నిన్న జంతర్ మంతర్‌కు వెళ్లి నిరసన తెలియజేస్తామని అడిగితే.. మమ్మల్ని ఆపేశారు. మా వాళ్లను కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, జ్ఞానేశ్ కుమార్ కుట్ర పన్నుతున్నారు. ఆ నలుగురికి శిక్ష పడటం మీరే చూస్తారు” అని రాహుల్ అన్నారు.

2లో▸

## జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

### నిజాయితీ పన్నుదారులకు సులభమైన విధానం.. పన్ను మోసాలపై కఠిన చర్యలు



- తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం.. మరింత ఆర్థిక నష్టం జరిగే అవకాశం
- హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనాలపై మంత్రుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన

జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగాలని స్పష్టం చేశారు.

2లో▸

## డిజిటల్ మౌలిక సదుపాయాల్లో ఇండియా నెంబర్1: చంద్రబాబు

### డిజిటల్ మౌలిక సదుపాయాల్లో భారత్ నంబర్1 అని చంద్రబాబు.



- ఏపీలో డిజిటల్ హబ్‌లు, డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి.
- ప్రతి 50 కి.మీ.కు పోర్టు/ఫిషింగ్ హార్బర్ ఉండేలా ప్రణాళికలు.
- పరిపాలనలో ఏఐ, సాంకేతికతతో సేవలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

2లో▸

## తెలంగాణ నుండి నైరుతి రుతుపవనాల తిరోగమనం




2లో▸

తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం మరింతగా కొనసాగింది. తాండూర్, వికారాబాద్, హైదరాబాద్, జనగామ, భూపాలపల్లి మీదుగా తిరోగమన రేఖ కొనసాగుతోంది.

## ఓటు చోరీ” ఆరోపణలకు అరెస్టులు సమాధానం కావు



బారికేడ్లతో ప్రజాస్వామ్యాన్ని బంధించలేరని, ప్రశ్నించే ఎంపీలను నిర్బంధించడం అధికార దర్పానికి నిదర్శనం అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సర్ పై ఢిల్లీలో లోక్ సభ లో ప్రతిపక్ష నేత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ చేస్తున్న పోరాటం పై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు.

గురువారం నాడిక్కడ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఓటు చోరీ పై ఘాటుగా స్పందించారు. రాహుల్ పోరాటాన్ని కేసులతో అణచివేయాలనుకోవడం కేంద్ర ప్రభుత్వ భ్రమ అని, ఢిల్లీలో రాహుల్--ప్రియాంక, ప్రతిపక్ష ఎంపీల నిర్బంధాన్ని మంత్రి ఉత్తమ్ ఖండించారు.

2లో▸

## గొడ్డలి పార్టీతో అభివృద్ధి కుంటుపడింది: హోం మంత్రి అనిత



2లో▸

గుంటూరు ఛానల్ పొడిగింపుతో 28 వేల ఎకరాలకు సాగునీరు.
మహిళా సంఘాలకు రూ.3 కోట్ల శ్రీనిధి రుణాలు, పనిముట్లు అందజేత.
పర్చూరులో రూ.75 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగిస్తాం: మహేశ్ గౌడ్



2లో▸

PRGI - TGTEL/25/A0348 జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార ఆగదు
09-10-2026

# రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా సంగారెడ్డి లో జగ్గారెడ్డి, నిర్మల దీక్ష...

- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసి వేణుగోపాల్ చేపట్టిన పోరాటానికి మద్దతుగా దీక్షకు నిర్ణయం
- సంగారెడ్డిలోని ఓల్డ్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలతో జగ్గారెడ్డి, నిర్మల సంఘీభావ దీక్ష..
- బుధవారం రాత్రి 10 గంటల నుండి దీక్ష ను ప్రారంభించిన జగ్గారెడ్డి, నిర్మల...

దేశ ప్రజల ఓటు హక్కు కోసం రాహుల్ గాంధీ యుద్ధం చేస్తున్నారు

- రాహుల్ గాంధీ పోరాటం కొనసాగినంత కాలం మా దీక్ష కొనసాగుతుంది: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి....
-...జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్..

అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్)

దేశ ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మల జగ్గారెడ్డి సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ..




ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ బలపడిన రాష్ట్రాల్లో ఎన్నికల వ్యవస్థను తమకు అనుకూలంగా మార్చుకుని అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ సహకారంతోనే బీజేపీ మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని, ఈ అంశంపై రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారని పేర్కొన్నారు. "ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ రాజకీయ పోరాటం కాదు.. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడే రాజకీయ యుద్ధం. దేశ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ రోడ్డుపై కూర్చొని పోరాడుతున్నారు" అని జగ్గారెడ్డి అన్నారు. ూ×= ప్రక్రియలోనూ ఎన్నికల కమిషన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, ఓటర్ల జాబితాల విషయంలో తలెత్తుతున్న వివాదాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. దేశ ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చేస్తున్న ఆరోపణలను ప్రస్తావించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ చేస్తున్న ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని జగ్గారెడ్డి తెలిపారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నేతలను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన ఖండించారు. "రాహుల్ గాంధీ పోరాటం చేసినన్ని రోజులు సంగారెడ్డిలో మేము కూడా దీక్ష కొనసాగిస్తాం. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు మద్దతుగా మా పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. దేశంలో స్వతంత్ర ఎన్నికల వ్యవస్థకు పునాదులు పడిన కాలం నుంచి నెహ్రూ--గాంధీ కుటుంబం ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చిందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు కోల్పోయారని, సోనియా గాంధీ సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో సేవలందించారని గుర్తుచేశారు. "త్యాగాల చరిత్ర ఉన్న కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ ఇప్పుడు దేశ ప్రజల ఓటు హక్కు కోసం పోరాడుతున్నారు. ఆయన పోరాటానికి ప్రజలంతా స్వచ్ఛందంగా మద్దతుగా నిలవాలి" అని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. దీక్షలో నిర్మల జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

- 2030 నాటికి టీబీ రహిత భారత్ సాధనే లక్ష్యం: జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్

మెదక్, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):





క్షయ వ్యాధి నిర్మూలనకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జోష్ టీమ్‌లను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డు, మండల స్థాయిలో జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ బృందాలను ఏర్పాటు చేసి ప్రజలకు టీబీపై అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 13 టీబీ ముక్త్ గ్రామ పంచాయతీలను గుర్తించినట్లు తెలిపారు. టీబీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే అంటువ్యాధి అని, దగ్గు, తుమ్ముల ద్వారా ఇతరులకు సోకే అవకాశం ఉందన్నారు. సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు ఉన్నవారు, పొగతాగే అలవాటు ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేసి అనుమానితులు పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం 215 యాక్టివ్ టీబీ కేసులు ఉన్నాయని, బాధితులకు ప్రతి నెలా వైద్య సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి మందులు అందించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నిక్షయ్ పోషణ్ యోజన కింద టీబీ రోగులకు పోషకాహారం కోసం చికిత్స పూర్తయ్యే వరకు నెలకు రూ.1,000 పోషణ భత్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా టీబీ రోగులను దత్తత తీసుకుని వారికి అవసరమైన పోషకాహారం అందించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు నిర్దేశిత కాలం పాటు మందులను క్రమం తప్పకుండా వినియోగిస్తే టీబీని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. టీబీ రోగులను దూరం పెట్టకుండా వారికి మానసిక ధైర్యం కల్పించాలని సూచించారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఒక్కొక్కరు ఒక టీబీ రోగిని దత్తత తీసుకుని వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. గ్రామస్థాయిలో సర్పంచులు, పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పనిచేసి టీబీ నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. టీబీ నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు మీడియా సహకారం తీసుకోవాలని తెలిపారు. టీబీ నివారణకు సంబంధించిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1800-11-6666 ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేసి టీబీ నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌సీసీ, మై భారత్ క్యాడెట్లు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కీ.శే. ప్రతాప్ రాజేశ్వర్ జ్యోషి వర్ధంతి సందర్భంగా నివాళులు

ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు

వట్‌పల్లి, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

కీ.శే. ప్రతాప్ రాజేశ్వర్ జ్యోషి వర్ధంతి సందర్భంగా వట్‌పల్లి మండల ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఒకానొక సమయంలో ప్రజలందరి ఆదరాభిమానాలు పొందుతూ 'పంతులు'గా పిలవబడిన ప్రతాప్ రాజేశ్వర్ జ్యోషి అందరికీ రాజకీయంగా, సామాజికంగా దిశానిర్దేశం చేశారని కాచూర్ రావు పేర్కొన్నారు. మచ్చలేని నిజాయితీ, నిరంతర శ్రమకు ఆయన నిలువుటద్దంగా నిలిచారని, ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన ఆయన కీర్తి చిరస్మరణీయమని అన్నారు. ప్రతాప్ రాజేశ్వర్ జ్యోషి ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఆయన సుపుత్రుడు రమేష్ జ్యోషి కూడా తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ రాజకీయ బాధ్యతలను నిర్వర్తించడం అభినందనీయమని కాచూర్ రావు పేర్కొన్నారు.




# టీబీ నిర్మూలనలో ఆదర్శంగా బోరంచ.. రెండోసారి పురస్కారం

నారాయణఖేడ్, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం బోరంచ గ్రామానికి టీబీ నిర్మూలనలో చేసిన కృషికి గాను రెండోసారి టీబీ ముక్త్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు, సీఈఓ జానకిరెడ్డి చేతుల మీదుగా ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప అవార్డును అందుకున్నారు. గ్రామంలో టీబీ నిర్మూలనకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని సర్పంచ్ అభినందించారు. గ్రామ ప్రజల సహకారంతో టీబీ నిర్మూలనలో బోరంచను ఆదర్శంగా నిలిపేందుకు మరింత కృషి చేయాలని, గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# ఢిల్లీలో నిరసనల వేళ.. 42 మంది రిటైర్డ్ న్యాయమూర్తుల బహిరంగ లేఖ



న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

ఢిల్లీలో ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ సంస్థలపై కొనసాగుతున్న విమర్శలు, నిరసనల నేపథ్యంలో 42 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు బహిరంగ లేఖ విడుదల చేశారు. రాజ్యాంగ సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలు ప్రజల్లో ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు సమర్పించకుండా 'ఓట్ చోరీ' ఆరోపణలు చేయడం, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలను 'దొంగలు', 'రాజీ పడిన సంస్థలు' అంటూ అభివర్ణించడం సరికాదని పేర్కొన్నారు. సంస్థలను విమర్శించడం ప్రజాస్వామ్య హక్కేనని, అయితే వాటిని కించపరచడం మాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) చట్టబద్ధంగా ఏర్పాటు చేసిన ప్రక్రియేనని, స్వచ్ఛమైన మరియు ఖచ్చితమైన ఓటర్ల జాబితా కోసం ఇటువంటి ప్రక్రియలు అవసరమని రిటైర్డ్ న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు ఉంటే వాటిని చట్టపరమైన, రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని వారు సూచించారు.

# ఆ నలుగురు రాజ్యాంగాన్ని నాశనం చేశారు: రాహుల్



న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ప్రశాంతంగా నిరసన తెలిపిన తమ నేతలపై దాడి చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గురువారం విపక్ష ఎంపీల లంచ్ మీట్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నలుగురు రాజ్యాంగాన్ని నాశనం చేసి, ఓట్లను దొంగిలించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొంటూ, ప్రతిపక్షంగా తాము వారిని చట్టం ముందు నిలబెడతామని అన్నారు. అనంతరం తాము రాజ్‌ఘాట్‌కు వెళ్లనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు.

సందేశం టైమ్స్

09-10-2026

# రోడ్డు పక్కన పెరిగిన ముండ్ల పొదలు తొలగింపు--సర్పంచ్ ఆధ్వర్యంలో



వట్‌పల్లి, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం ఉసిరికాపల్లి గ్రామ పరిధిలో రోడ్డు పక్కన విపరీతంగా పెరిగిన ముండ్ల పొదలతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ సిర్గాపురం శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వాటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. రోడ్డు పక్కన పెరిగిన ముండ్ల పొదలు వాహన రాకపోకలకు ఆటంకంగా మారడంతో పాటు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉండటంతో వాటిని పూర్తిగా తొలగించారు. ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కవెల్లి రాజు, వార్డు సభ్యుడు మోహన్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులు, విజేందర్ రెడ్డి, శివయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా మాత నవరాత్రులకు అన్నదానానికి రూ.50 వేల విరాళం



వట్‌పల్లి, అక్టోబర్ (సందేశం టైమ్స్ ప్రతినిధి అందోల్ కోఆర్డినేటర్ సిహెచ్ బస్వరాజు ): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్రంలోని దుర్గా మాత ఆలయంలో నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ మండల నాయకులు పెద్దపట్ల వినయ్ గౌడ్ రూ.50,000 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వట్‌పల్లి గ్రామ సర్పంచ్ మచ్చూరి రవీందర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ రావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిగంబర్ రావు, ఎన్ఎస్‌యూఐ ఆందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజా, వార్డు సభ్యులు నర్సింహ గౌడ్, బాగ్లీ ఇస్మాయిల్ పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు బాగన్న, కిష్టయ్య, దుర్గయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ సందీప్ కుమార్

**వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




సంగారెడ్డి, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా నూతనంగా నియమితులైన సందీప్ కుమార్ గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ సందీప్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం వేగవంతంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు

**- తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**







మెదక్, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):ం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు, అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మెదక్‌లోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్స్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ూా×వీజూ క్యాంపుల ద్వారా అవసరమైన ఉపకరణాలను అందించడంతో పాటు ఎస్కార్ట్, రీడర్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ వంటి సహాయాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. మెదక్ జిల్లాలోని 21 భవిత కేంద్రాల్లో 194 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. సాధారణ పాఠశాలలకు వెళ్లలేని పిల్లలకు భవిత కేంద్రాల్లో అవసరమైన విద్యా సౌకర్యాలు కల్పిస్తూ ×జుౕాలు విద్యాబోధన చేస్తున్నారని పేర్కొన్నారు. భవిత కేంద్రాలకు కూడా రాలేని పిల్లల కోసం హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ద్వారా ×జుౕాలు వారి ఇళ్లకు వెళ్లి విద్యను అందిస్తున్నారని, ప్రస్తుతం 63 మంది పిల్లలకు ఈ విధంగా విద్య అందిస్తున్నట్లు తెలిపారు. భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించిన వారిలో ఇప్పటివరకు 46 మంది పిల్లలను తిరిగి సాధారణ పాఠశాలల్లోకి మెయిన్‌స్ట్రీమింగ్ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం జిల్లాలోని భవిత కేంద్రాల నిర్వహణకు గత సంవత్సరం ప్రభుత్వం రూ.1.06 కోట్లు మంజూరు చేసిందని, ఈ నిధులతో కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు, పిల్లల పట్ల ఓర్పుతో వ్యవహరించి వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి ప్రతిభను గుర్తించి, వారి సామర్థ్యాలను పెంపొందిస్తూ ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఏఎంఓ సుదర్శన్ మూర్తి, ఐఈ అండ్ సీఎంఓ రాజు, ఏఎస్ఓ నవీన్, మురళీమోహన్, మెదక్ ఎంఈఓ శంకర్, జిల్లాలోని ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు, ×జుౕాలు, జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

**- పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




సూర్యాపేట, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బ్లాంకెట్ హాల్‌లో తొమ్మిదో పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి కుటుంబంలో పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి సకాలంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సీడీపీఓ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు

**- హాట్‌స్పాట్లు, బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు**



సూర్యాపేట, అక్టోబర్ 9(సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రమాదకర ప్రాంతాలైన హాట్‌స్పాట్లు, బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సీవీ ఆనంద్ సూచించారు. ఈ అంశాలపై రాష్ట్రంలోని ఎస్పీలతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఎస్పీ నర్సింహ ఐపీఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, సేవ్‌లైఫ్ ఫౌండేషన్ సహకారంతో రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయడం ద్వారా ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలు, హాట్‌స్పాట్లు, బ్లాక్‌స్పాట్లను కచ్చితంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ సూచించారు. ప్రమాద ప్రాంతాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా నమోదు చేసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవడం ద్వారా ఆయా ప్రాంతాల్లో అవసరమైన రహదారి భద్రతా చర్యలు, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రమాదాల నివారణకు అవసరమైన మార్పులు చేపట్టేందుకు వీలవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం, సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై డీజీపీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు చేపడుతున్న తనిఖీలు, పెట్రోలింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు, రహదారుల శాఖ అధికారులతో సమన్వయం తదితర అంశాలను ఎస్పీ నర్సింహ వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, ఐటీ ఫోర్ ఎస్ఐ సాయిరాం, రోడ్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# అందోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్కు ఘన సన్మానం



ఆందోల్ : సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 9 సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలానికి నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తాలేల్మ సర్పంచ్ అశోక్.. నేరడిగుంట గ్రామానికి మండల అధ్యక్షుడు హోదాలో మొదటిసారి విచ్చేసిన సందర్భంగా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. బుధవారం రోజున గ్రామస్థులు గొల్ల సుమిత్ర-అర్జున్ దంపతుల ముద్దుల కూతురు మొదటి జన్మదిన వేడుకలకు అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల సందర్భంగా మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ చందులత వీరమల్లప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వైద్యనాథ్( పట్లోళ్ల రాజు పటేల్) ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిని గ్రామ ప్రజలు, నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోడ్లోళ్ల కిష్టయ్య, ఎర్రారాం అనిల్‌రెడ్డి, రాంసాన్‌పల్లి యువకిశోరం చింటు, పట్లోళ్ల రవీందర్, ఆశయ్య, ఎర్రోళ్ల జోగినాథ్, వరప్రసాద్, మణి, డప్పు శంకరయ్య, రిపోర్టర్లు నర్సమ్మ పాండరీ, మన్నే నాగయ్య, గున్నాల మధు, కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని బోయిని శివకుమార్, జహీరాబాద్ నర్సింలుతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# అక్టోబర్ 14న హైదరాబాద్‌లో గీత కార్మికుల రాష్ట్ర సదస్సు

- సదస్సును జయప్రదం చేయాలి: కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్

**అందోల్, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ నియోజకవర్గ ప్రతినిధి కే. మల్లేశం గౌడ్):** కల్లుగీత కార్మిక సంఘం ఏర్పడి 69 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 14న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో వార్షికోత్సవాలతో పాటు 'వృత్తిలో ఆధునీకరణ' అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని గీత కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి, కల్లుగీత కార్మిక సంఘం 69వ వార్షికోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 50 సంవత్సరాలు నిండిన 37,381 మంది గీత



కార్మికులు కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, సంగారెడ్డి జిల్లాలో 585 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరందరికీ ఎటువంటి షరతులు లేకుండా పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తి నిర్వహించే గీత కార్మికులందరికీ కంఠమయ్య రక్షణ కవచాలు అందించాలని, ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందించాలని, వృత్తిలో ఆధునీకరణ పద్ధతులను అమలు చేయాలని కోరారు. చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని, పెన్షన్‌ను రూ.4 వేలకు, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో గీత కార్మిక సొసైటీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలు, వృత్తిలో ఆధునీకరణ తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 14న సుందరయ్య కళానిలయంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షులు, టీఎఫ్‌టీ బాధ్యులు, గౌడలు, గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజా గౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి వెంకటేశం గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామ గౌడ్, యాద గౌడ్, రవి గౌడ్, సంగారెడ్డి మండల ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్, జిల్లా నాయకులు సాయ గౌడ్, శేఖర్ గౌడ్, కృష్ణ గౌడ్, నవీన్ గౌడ్, సుధాకర్ గౌడ్, మల్లేశం గౌడ్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అందోల్ మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా లోక్ భవన్ ముట్టడి

**సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ డిస్టిక్ కోఆర్డినేటర్ (వెంకటేష్)**
రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ మరియు అగ్రనేత రాహుల్ గాంధీకి మద్దతుగా సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని లోక్ భవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆందోల్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ ఆందోల్ జగన్మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్, అలాగే ముఖ్య నాయకులు మైలుగుండ్ల వీరమల్లప్ప, పట్లోళ్ల రాజు( వైద్యనాథ్) పటేల్ తదితరులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ నిరసనను గట్టిగా వినిపించారు.

**ముఖ్య విషయాలు:**
ప్రధాన డిమాండ్: దేశవ్యాప్తంగా అర్హులైన కోట్ల మంది ఓట్లను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీకి మద్దతు: ఓట్లను తొలగించిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని చట్టవిరుద్ధంగా అరెస్ట్ చేయడాన్ని నాయకులు తీవ్రంగా తప్పుబట్టారు.




భవిష్యత్తు కార్యాచరణ: ఈ అణచివేతకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన లోక్ భవన్ ముట్టడి కార్యక్రమం విజయవంతమైందని, ఎన్నికల కమిషనర్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

-- ప్రతి గ్రామపంచాయతీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి: అదనపు కలెక్టర్ ఆర్. పాండు

**సంగారెడ్డి, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆర్. పాండు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఎన్‌సీసీ, మై భారత్ వాలంటీర్లు, ఎంపీడీవోలు, సర్పంచ్‌లతో టీబీ ముక్త్ భారత్ అభియాన్, జోష్ ఉన్నతస్థాయి జిల్లా కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, సత్వర చికిత్స అందించడం వంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో టీబీ లక్షణాలు, పరీక్షలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు స్థానిక సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో యువతను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె. లలితాదేవి మాట్లాడుతూ నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ కింద జిల్లాలో టీబీ వ్యాధి ముందస్తు గుర్తింపు, సత్వర చికిత్స, నివారణ, కమ్యూనిటీ భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2026 సెప్టెంబర్ వరకు జిల్లాలో 1,750 టీబీ కేసులు నమోదయ్యాయని, బాధితులకు



అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఏడు ఫంక్షనల్ ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉండగా, 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు నిర్దేశిత లక్ష్యంలో 109 శాతం ఎక్స్‌రే వినియోగం సాధించినట్లు తెలిపారు. టీబీ బాధితులకు నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం అందించడంతో పాటు పోషకాహార సహాయం అందిస్తున్నట్లు వివరించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా టీబీ ముప్పు అధికంగా ఉండే 144 గ్రామాలను గుర్తించి నిక్షయ్ శివిర్ క్యాంపుల ద్వారా వల్నరబుల్ జనాభాకు టీబీ స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కమ్యూనిటీ భాగస్వామ్యం, అవుట్‌రీచ్, క్షేత్రస్థాయి కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు బ్లాక్ స్థాయిలో ఎంపీడీవోల నేతృత్వంలో మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లతో జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ టీబీ ముక్త్ భారత్ టీమ్స్) బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామపంచాయతీలను టీబీ రహిత పంచాయతీలుగా ప్రకటించేందుకు నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గుర్తించిన 41 టీబీ రహిత గ్రామాలకు సంబంధించిన సర్టిఫికెట్లను అదనపు కలెక్టర్ ఆర్. పాండు ఎంపీడీవోలు, సర్పంచ్‌లకు అందజేశారు. అలాగే మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం టీబీ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ నిర్వహించారు. క్షయ వ్యాధి రహిత భారతదేశ నిర్మాణంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత భాగస్వాములై సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారిణి సీహెచ్ అరుణాకుమారి, జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, జిల్లా యువజన అధికారి, ఎన్‌సీసీ యూనిట్ కమాండర్, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# అండర్-19 రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంజేపీ బోనకల్ విద్యార్థుల ఎంపిక




**బోనకల్: టసందేశం టైమ్స్ఊఅక్టోబర్ 9 ఖమ్మం జిల్లా ఇంచార్జ్ శెట్టి సురేష్**
అండర్-19 రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంజేపీ బోనకల్ కళాశాల విద్యార్థులు ఎంపిక కావడంతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్‌సీఓ రాంబాబు, ఖమ్మం జిల్లా డీసీఓ, కళాశాల ప్రిన్సిపాల్ సుష్మా, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు పి. వెంకట్రావు, పి. వెంకటేశ్వర్లు విద్యార్థులను అభినందించారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని వారు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది.

# చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, అక్టోబర్ 9**




పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బ్లాంకెట్ హాల్‌లో తొమ్మిదో పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి కుటుంబంలో పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి సకాలంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సీడీపీఓ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# చౌటకుర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయుట.

**సంగారెడ్డి /అక్టోబర్ 9 సందేశం టైమ్స్**
చౌటకూర్ గ్రామంలో మాజీ జెడ్పిటిసి సుభాష్ రెడ్డి గారిచే మరియు చౌటకుర్ మండల్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ మరియు గ్రామ సర్పంచ్ పార్కల్



రాంరెడ్డి, రామా గౌడ్ ,రమేష్,జైపాల్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# చౌటకూర్ మండలంలో టీబీ కేసులు లేని గ్రామంగా కోర్పోల్‌కు గుర్తింపు

సంగారెడ్డి, అక్టోబర్ 9: టసందేశం టైమ్స్‌ఊ చౌటకూర్



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో చౌటకూర్ మండలంలోని కోర్పోల్ గ్రామ పంచాయతీని టీబీ కేసులు లేని గ్రామంగా ప్రకటించారు. ఈ సందర్భంగా కోర్పోల్ గ్రామ సర్పంచ్ సునీత ప్రవీణ్ రెడ్డి, ఎంపీడీవో కే. శంకర్, పంచాయతీ కార్యదర్శి మల్లేశంలకు అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకి రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే. శంకర్ మాట్లాడుతూ చౌటకూర్ మండలంలోని అన్ని గ్రామాలను టీబీ కేసులు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. టీబీ వ్యాధి నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, అనుమానిత కేసులను ముందస్తుగా గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కోర్పోల్ గ్రామం టీబీ కేసులు లేని గ్రామంగా గుర్తింపు పొందడం పట్ల గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# రాంసానిపల్లిలో తేనెటీగల పెంపకం యూనిట్ పరిశీలన

**తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే అవకాశం: జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు**

ఆందోల్, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం రాంసానిపల్లి గ్రామంలో రైతు పరిపూర్ణ ఏర్పాటు చేసిన తేనెటీగల పెంపకం యూనిట్‌ను జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి సోమేశ్వరరావు గురువారం సందర్శించారు. ఆయన వెంట మండల ఉద్యాన అధికారి సమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ తేనెటీగల పెంపకం రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అందించే మంచి అనుబంధ వృత్తి అని తెలిపారు. తేనెటీగల ద్వారా పరపరాగ సంపర్కం జరిగి పంటల దిగుబడి 20 నుంచి 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని, స్వచ్ఛమైన తేనెతో పాటు మైనం, రాయల్ జెల్లీ వంటి ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. రైతు పరిపూర్ణ కృషిని అభినందిస్తూ ఇతర రైతులు కూడా తేనెటీగల పెంపకాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీల్లో భాగంగా రూ.6,000 విలువైన తేనెటీగల పెట్టె (బీ బాక్స్ విత్ కాలనీ)పై రూ.2,400 సబ్సిడీ, తేనె తీసే యంత్రం (హనీ ఎక్స్‌ట్రాక్టర్)తో పాటు ఇతర అనుబంధ పరికరాలకు రూ.8,000 వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు, యువతీ యువకులు, మహిళా సంఘాల సభ్యులు తమ మండల ఉద్యాన అధికారిని లేదా సంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, తేనెటీగల పెంపకందారులు పాల్గొన్నారు.

# మాటేటి వేణుగోపాల్‌కు పితృవియోగం.. మాజీ ఎంపీ నామ పరామర్శ

ఖమ్మం, అక్టోబర్ 9



మాటేటి వేణుగోపాల్ తండ్రి రామారావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఫోన్‌లో మాటేటి వేణుగోపాల్‌తో మాట్లాడి పరామర్శించారు. రామారావు ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని నామ నాగేశ్వరరావు ప్రార్థించారు.

# ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళిక

**తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

సంగారెడ్డి, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



సంగారెడ్డి జిల్లా లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, భూగర్భ జలాల లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో తాగునీటి సమస్యకు గురయ్యే గ్రామాలు, ఆవాసాలను ముందుగానే గుర్తించి ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి వనరుల పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న బోర్‌వెల్స్, నీటి నిల్వ ట్యాంకులు, పైప్‌లైన్లు, మోటార్ల పనితీరును పరిశీలించి పనిచేయని వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన కొత్త బోర్‌వెల్స్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందుగానే ట్యాంకర్లను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట అద్దె ప్రాతిపదికన నీటి వనరులను వినియోగించుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలను గుర్తించి వెంటనే అరికట్టాలని సూచించారు. తాగునీటి అవసరాలకు సంబంధించిన పనులను అత్యవసర, అత్యంత ప్రాధాన్యత, సాధారణ ప్రాధాన్యతగా విభజించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిర్గాపూర్, కంగ్టి, నాగల్‌గిద్ద, రాయికోడ్, వట్‌పల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో తాగునీటి సమస్యకు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల వారీగా నీటి లభ్యత, అవసరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ మండల అధికారులు, పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమస్య ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలతో తాగునీటి ఎద్దడిని నివారించేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, మిషన్ భగీరథ గ్రిడ్ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పాషా, డిప్యూటీ ఈఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ అరెస్టు.. ప్రజాస్వామ్య గొంతు నొక్కే కుట్ర






**- ప్రశ్నించే నాయకుడిని అణచలేరు.. ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ పోరాటం ఆగదు**
**- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి: నీలం మధు ముదిరాజ్**

హైదరాబాద్, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడికి నిదర్శనమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ విమర్శించారు. రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ గురువారం టీపీసీసీ, ఇండియా బ్లాక్ పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్తున్న నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ బాధ్యత అని, అలాంటి గొంతును అణచివేసేందుకు అరెస్టులను ఉపయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వమే ప్రశ్నించే గొంతులను అణచివేసే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం నేరం కాదని, ప్రజల తరఫున నిలబడటం ప్రతిపక్షాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని అరెస్టు చేసినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అరెస్టులు, కేసులు, బెదిరింపులతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే అది సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి పోరాటం కొత్త కాదని, దేశ స్వాతంత్ర్యం నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణ వరకు అనేక సందర్భాల్లో ప్రజల పక్షాన నిలిచిందని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తోందని, ఓట్ల అక్రమ తొలగింపుపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నందుకే రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుంటున్నారని నీలం మధు ఆరోపించారు. ప్రజల గొంతుకగా నిలిచిన నాయకుడిపై ఎన్ని ఆంక్షలు విధించినా ఆయన పోరాటాన్ని ఆపలేరని అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# చౌటకుర్ గ్రామంలో ముస్లిం స్మశానవాటికలో మొరం పోసి చదును

**ముస్లిం సోదరుల వినతికి స్పందించిన సర్పంచ్ పార్శల రామ్‌రెడ్డి**
**సర్పంచ్‌ను శాలువాతో సత్కరించిన ముస్లిం సంఘం సభ్యులు**

సంగారెడ్డి /అక్టోబర్ 9 సందేశం టైమ్స్

చౌటకూర్ :-చౌటకూర్ మండల కేంద్రంలోని ముస్లిం స్మశానవాటిక (కబ్రస్తాన్)లో సమాధులు చేయడానికి సరైన స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ముస్లిం సోదరులు గ్రామ సర్పంచ్ పార్శల రామ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్మశానవాటికలో పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో పాటు నేల సరిగా లేకపోవడంతో మృతదేహాలను సమాధి చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని ముస్లిం సంఘం పెద్దలు సర్పంచ్‌కు వివరించారు.ముస్లిం సంఘం సభ్యుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సర్పంచ్ పార్శల రామ్‌రెడ్డి బుధవారం స్మశానవాటికలోని పరిస్థితులను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న గుంతలను మొరం ద్వారా పూడ్చి, స్మశానవాటికలోని ప్రదేశాన్ని చదును చేయించారు. దీంతో సమాధులు చేసేందుకు ఇబ్బందులు తొలగడంతో ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను కుల, మత భేదాలు లేకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ పార్శల రామ్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో ఏ వర్గానికి చెందిన ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చినా, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.తమ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు స్పందించి స్మశానవాటికలో



మొరం పోసి చదును చేయించిన సర్పంచ్ పార్శల రామ్‌రెడ్డికి ముస్లిం సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సర్పంచ్ చూపుతున్న చొరవను వారు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు దప్పు అశోక్, గోరమియా, గ్రామస్తులు నారాయణ గౌడ్, ఆగమయ్య, రాజేశ్వర్ గౌడ్, నగేష్, కుమార్ గౌడ్, మల్లికార్జున్, కిట్టు, ముస్లిం సంఘం సభ్యులు హాజీ, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్-18 ఖో-ఖో జిల్లా స్థాయి ఎంపికలు

- నర్సాపూర్‌లో అక్టోబర్ 10న నిర్వహణ

**నర్సాపూర్, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ చౌటకూరు మండల్ రిపోటర్ డి రమేష్**

మెదక్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-18 బాలబాలికల జిల్లా స్థాయి ఖో-ఖో ఎంపికలను అక్టోబర్ 10న నర్సాపూర్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. హరికిషన్, ప్రధాన కార్యదర్శి బి. శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. నర్సాపూర్‌లోని టీ.జీ.టీ.డబ్ల్యూ.ఆర్.ఎస్‌లో ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2026 డిసెంబర్ 31 నాటికి 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న క్రీడాకారులు మాత్రమే అర్హులని, 01-01-2009 లేదా ఆ తర్వాత జన్మించిన వారు



ఎంపికలకు హాజరుకావచ్చని తెలిపారు. క్రీడాకారుల ఎంపికలో వయస్సు ం ఎత్తు (సెం.మీ.) ం బరువు (కిలోలు) ఆధారంగా ఇండెక్స్ స్కోర్ విధానాన్ని అనుసరిస్తామని, బాలురు, బాలికలు రెండు విభాగాల్లోనూ ఇండెక్స్ స్కోర్ 250 పాయింట్లకు మించకూడదని వెల్లడించారు. ఎంపికలకు హాజరయ్యే ప్రతి క్రీడాకారుడు బోనాఫైడ్ ఎలిజిబిలిటీ ఫారంతో పాటు సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్ లేదా హెడ్‌మాస్టర్ సంతకాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అలాగే వయస్సు ధృవీకరణ పత్రం, ఇతర అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 15 నుంచి 17 వరకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖో-ఖో టోర్నమెంట్‌లో మెదక్ జిల్లా తరపున పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కోరింది.

## నూతన క్రిమినల్ చట్టాలపై 7వ బెటాలియన్ టీజీఎస్పీలో శిక్షణ..

**అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)**



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని 7వ బెటాలియన్ టీజీఎస్పీలో సి డ హెచ్‌క్యూ కంపెనీ సిబ్బందికి నూతన క్రిమినల్ చట్టాలపై గురువారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నుంచి వచ్చిన కే. వెంకట్రావు, ఎస్ఐపీ, సీటీసీ, సయ్యద్ ముజాహిద్, మాచందర్ రెడ్డి, ఎస్ఐపీ, సీబీఎస్‌లు నూతన క్రిమినల్ చట్టాల్లో వచ్చిన ముఖ్యమైన మార్పులు, వాటి అమలులో పోలీసు సిబ్బంది పాటించాల్సిన విధానాలు, కేసుల దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. నూతన క్రిమినల్ చట్టాలపై ప్రతి పోలీసు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని శిక్షణలో వివరించారు. విధి నిర్వహణలో చట్టపరమైన నిబంధనలు, దర్యాప్తు ప్రక్రియలు, కేసుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కమాండెంట్ బి. సీతారాం, అసిస్టెంట్ కమాండెంట్లు డి. శ్రీనివాసరావు, నరసింహస్వామితో పాటు సి డ హెచ్‌క్యూ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

## తిమ్మినేనిపాలెం, తిరుమలపురంలో ఎమ్మెల్సీ ఎన్నికల ముఖ్యనాయకుల సమావేశం

**చింతకాని: టసందేశం టైమ్స్ఱ ఖమ్మం జిల్లా, చింతకాని ప్రతినిధి అక్టోబర్ 9**



చింతకాని మండలంలోని తిమ్మినేనిపాలెం, తిరుమలపురం గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముఖ్య నాయకుల సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంకెన రమేష్ పాల్గొని, 2023 సంవత్సరానికి ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిమ్మినేనిపాలెం సర్పంచ్ కొమ్ము ప్రభు, తిరుమలపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, ఉపసర్పంచ్ గోగుల నరసింహారావు, గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు షేక్ మదర్ సాహెబ్, నాయకులు కూచిపూడి సురేష్, వార్డు నెంబర్ షేక్ మీరాసాహెబ్, నాదెండ్ల వెంకటేష్, సామినేని జమలయ్య, ఆళ్ల మోహన్‌రావు, చింతల సీతయ్య, కొమ్ము నరేష్, తెల్లగొర్ల రాంబాబు, గుగ్గిల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## టీబీ రహిత గ్రామాలకు అవార్డులు

**చింతకాని, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



ప్రధానమంత్రి టీబీ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనకు వైద్య ఆరోగ్యశాఖ చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 2024, 2025 సంవత్సరాల్లో ఒక్క టీబీ కేసు కూడా నమోదు కాని అనంతసాగర్, పందిళ్లపల్లి, కోదుమూరు, రేపల్లెవాడ గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ప్రత్యేక అవార్డులను అందజేసి అధికారులు అభినందించారు. ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేణుమాధవ్, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ నివేదిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో టీబీపై ప్రజలకు అవగాహన కల్పించడం, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని సకాలంలో గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి పూర్తిస్థాయిలో చికిత్స అందించడం ద్వారా టీబీ నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. 2024--2025 సంవత్సరాల్లో తమ గ్రామాల్లో ఒక్క టీబీ కేసు కూడా నమోదు కాకుండా టీబీ రహిత గ్రామాలుగా నిలిచిన అనంతసాగర్, పందిళ్లపల్లి, కోదుమూరు, రేపల్లెవాడ గ్రామాల సర్పంచ్‌లను ప్రత్యేకంగా అభినందించి అవార్డులు అందజేశారు. టీబీ నిర్మూలన కోసం ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రజలు సమన్వయంతో పనిచేసి ప్రధానమంత్రి టీబీ రహిత భారత్ కార్యక్రమం లక్ష్యాలను సాధించాలని చింతకాని మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ పిలుపునిచ్చారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- ఆస్తి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు.. రాత్రివేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి

**మెదక్ అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)**




మెదక్ ప్రతినిధిశివంపేటపోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ గురువారం శివంపేట పోలీస్‌స్టేషన్‌ను మెదక్‌జిల్లాఎస్పీడి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీచేశారు.ఈసందర్భంగాపోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించారు.మహిళలు, బాలికలపైజరిగేనేరాలకుసంబంధించిన కేసుల్లో దర్యాప్తునునిర్ణీతగడువులో పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని అధికారులనుఆదేశించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతంచేయడంతోపాటుకేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలనునిబంధనల ప్రకారం ఈ-సాక్ష్యలో నమోదు చేసిభద్రపరచాలని తెలిపారు. దర్యాప్తులో సాంకేతికపరిజ్ఞానాన్నిసమర్థవంతంగావినియోగించుకోవాలనిసూచించారు.సీసీటీఎన్ఎస్‌లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు. పెండింగ్ రిపోర్టులను త్వరితగతిన పూర్తి చేసి దర్యాప్తులో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని స్పష్టం చేశారు.పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆస్తి నేరాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచాలని సూచించారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలాపర్యవేక్షించాలని సూచించారు.అనంతరం పోలీస్‌స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలనుసానుకూలంగా పరిష్కరించేలాబాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలనిఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందిస్తూ పోలీస్‌శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలనిసూచించారు.
ఈ తనిఖీలో సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్‌రెడ్డి, శివంపేట ఎస్సై మధుకర్‌రెడ్డితో పాటు పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు రోజుల క్రితం దాడి చేసింది చిరుత..

**అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)**



సిరికొండ మండల కేంద్రంలోని గుడిలింగాపూర్ వెస్ట్ బీట్, తూంపల్లి సెక్షన్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 487 అటవీ ప్రాంతంలో మూడు రోజుల క్రితం వ్యక్తిపై దాడి చేసిన జంతువు చిరుతేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. దుప్యాతండాకు చెందిన భూక్య చెన్న (తండ్రి నేమ్యా) మేకలు మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లిన సమయంలో చిరుత దాడి చేయడంతో ఎడమ చేతి పైభాగం, కుడి కాలి తొడపై గాయాలయ్యాయి.విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చెన్నను సిరికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్న చెన్నను వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో ప్రస్తుతం ఇంటి వద్ద ఉన్నట్లు సిరికొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కే. నర్సింగరావు తెలిపారు.అటవీ ప్రాంతాల్లో చిరుత సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్ఓ నర్సింగరావు సూచించారు. వన్యప్రాణుల సంచారం కనిపించినా, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## మురం శెట్టి రాములు జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు..

**అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)**



గో ప్రేమికుడు, గణేష్ దీక్షకారకుడు, నిత్యాన్వేషి, సాంఘిక, సామాజిక, ఆధ్యాత్మిక సేవకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు మురం శెట్టి రాములు 70వ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 20 మంది పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని అన్నారు. మురం శెట్టి రాములు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మురం శెట్టి రాములను ఆదర్శంగా తీసుకొని గోసేవతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)



ఆత్మకూరు మండలం పెద్దాపురం హైస్కూల్ నందు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థను ప్రారంభించిందని తెలిపారు.విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ పాఠశాలలకు దీటైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు.

## పరకాల పట్టణాన్ని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం

- పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి
- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి

అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)



గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని అన్ని వార్డులలో మున్సిపల్ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల పట్టణాన్ని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకమైన డిపిఆర్ వ్యవస్థతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వసతులతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.పరకాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రజలు సహకరించాలని అన్నారు.గత బిఆర్ఎస్ పాలకుల మోసపూరిత మాటలతో పరకాల పట్టణం వెనుకబడిందన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)



పరకాల ఆర్టీసీ డిపో యందు టీజీఎస్ఆర్టీసీ ఎన్నికల సందర్భంగా టి డబ్ల్యూ యూ, ఎస్ డబ్ల్యూ ఎఫ్, ఐ ఎన్ టి యూ సి కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. రీజియన్ క్లాస్ సీరియల్ నెంబర్ 6, స్టేట్ క్లాస్ సీరియల్ నెంబర్ 3 బాణం గుర్తుపై ఓటు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ కార్మికులను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తుందని అన్నారు.ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఐక్య కూటమి అభ్యర్థులు కృషి చేస్తారని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ఆర్టీసీ కార్మికుల ఎన్నికలను అడ్డుకుని, వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తూ, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు.ఐక్య కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

# ఓట్లు తొలగించి, దేశ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న కేంద్రంలోని బి.జె.పి. ప్రభుత్వం

- రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, ఎంపి రఘురాంరెడ్డిలపై దాడి అమానుషం
- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ - కొత్వాల
- కాంగ్రెస్, సిపిఐ, మిత్రపక్షాల ఆధ్వర్యంలో కొత్తగూడెంలో భారీ ప్రదర్శన
- మిత్రపక్షాలు, జిల్లాకాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్నతో పాటు పాల్గొన్న - కొత్వాల

అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)

ప్రజల ఓట్లను తొలగించి, కేంద్రం లోని బి.జె.పి. ప్రభుత్వం దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ‘ సర్. ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని, సర్.ప్రక్రియలో అక్రమంగా తొలగించిన ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని, రాహుల్ గాంధీ పై దాడి అప్రజాస్వామికం అని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో కొత్తగూడెం ఓల్డ్ డిపో సెంటర్ నుండి రైల్వేస్టేషన్ సెంటర్ వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, వివిధ పార్టీల మిత్రపక్షాలతో పాటు కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ సర్ పేరుతో బి.జె.పి. యేతర పార్టీల ఓట్లు తొలగించి, తిరిగి



మరోసారి గద్దెనెక్కాలనే కుటిల యత్నాలకు బిజేపి పాల్పడుతున్నదని కొత్వాల అన్నారు. ఈ ప్రక్రియపై బుధవారం ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపి లు ప్రియాంకగాంధీ, రామసహాయం రఘురామ్‌రెడ్డి లపై దాడికి పూనుకుందన్నారు. ఏది ఏమైనా ‘ సర్’ పై ఆందోళన కార్యక్రమాలు, ఎన్నికల కమిషనర్ ను తొలగించేవరకు కాంగ్రెస్, మిత్రపక్షాల పోరాటం ఆగదని కొత్వాల హెచ్చరించారు.

# సీతారామ.. సత్తుపల్లి ట్రంక్ పనులకు వేగం భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి..

- రైతులకు పరిహారం అందించాలి
- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ
- ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు.. పలు మండలాలకు తాగునీటి భరోసా

అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతుల భూములను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం, సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయి, ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులు, భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### సత్తుపల్లి ట్రంక్ పనులపైనా దృష్టి

సత్తుపల్లి ట్రంక్ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరాన్ని మంత్రి తుమ్మల ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారాన్ని వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ పనులు పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు మండలాల పరిధిలో సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు.రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని తుమ్మల పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా పెండింగ్ పనులన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.మంత్రి తుమ్మల విజ్ఞప్తులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టులకు



సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, టన్నెల్ తదితర పనుల పురోగతిపై చర్చించారు. రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయడం, భూసేకరణ సమస్యలను పరిష్కరించడం కీలకమని ఈ సందర్భంగా స్పష్టమైంది.సీతారామ ఎత్తిపోతల పథకం సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు సాగునీటి సౌకర్యం మెరుగుపడటంతో పాటు తాగునీటి అవసరాలకూ భరోసా లభించనుంది. ఈ నేపథ్యంలో పనుల వేగవంతం, భూసేకరణ పరిష్కారం, రైతులకు పరిహారం చెల్లింపులపై ప్రభుత్వం తీసుకునే చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# నాన్‌వెజ్ వ్యర్థాల సేకరణకు టెండర్ ఖరారు..

అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణకు మున్సిపల్ అధికారులు ఆహ్వానించిన టెండర్లను గురువారం మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, టెండర్ నిర్వాహకుల సమక్షంలో ఓపెన్ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 9 సంస్థలు టెండర్లు దాఖలు చేయగా, ఇద్దరు ప్రతినిధులు గైర్హాజరయ్యారు. కనకదుర్గ ఎంటర్‌ప్రైజెస్ డీడీ సమర్పించకపోవడంతో ఆ సంస్థ టెండర్‌ను తిరస్కరించారు.మిగిలిన 8 సంస్థల టెండర్లను అధికారులు పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన షా ఎంటర్‌ప్రైజెస్ రూ.2.34 లక్షలు





అత్యధిక మొత్తాన్ని కోట్ చేయడంతో ఆ సంస్థకు టెండర్ దక్కింది. ఇతర సంస్థలు మైనే ఫుడ్ అండ్ సీడ్స్ రూ.1.85 లక్షలు, ఆజాల్ ట్రేడర్స్ రూ.1.65 లక్షలు, మహబూబా ఎంటర్‌ప్రైజెస్ రూ.1.80 లక్షలు, తాజ్ ఎంటర్‌ప్రైజెస్ రూ.1.72 లక్షలు, ఎస్‌కేపీ ట్రేడర్స్ రూ.1.55 లక్షలు, మనం ఎంటర్‌ప్రైజెస్ రూ.1.80 లక్షలు చొప్పున టెండర్లు దాఖలు చేశాయి.ఈ సందర్భంగా కమిషనర్ పర్వతాలు మాట్లాడుతూ టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాలను సేకరించాలని టెండర్ దక్కించుకున్న సంస్థకు సూచించారు. కార్యక్రమంలో డీఈ హన్మంత్ రావు, టీపీఓ వినీత్ పాల్గొన్నారు.
1

# పెద్ద వాల్గోట్ కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

అక్టోబర్ 09 (సందేశం టైమ్స్)

పెద్ద వాల్గోట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని భోజనశాల, వంటగది, తరగతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత తదితర అంశాలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల విద్య, వసతి, భోజనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

